



ప్రొద్దుటూరులో వ్యాపారాలు లేక ఖాళీగా ఉన్న చికెన్ సెంటర్

బర్డ్‌ఫ్లూ.. ఇది ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎక్కడో కోళ్లకు సోకిన ఈ వ్యాధి ప్రభావం మన జిల్లాలో కూడా పడింది. దీంతో చికెన్ ముక్క లేనిదే ముద్ద దిగని వారు సైతం అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఆ షాపుల వైపు వెళ్లాలంటేనే హడలెత్తిపోతున్నారు. అయితే వ్యాపారులు మాత్రం ఇలా ఉంటే తమ జీవనం గడిచేదెలా అంటూ ఆవేదన చెందుతున్నారు. రోజూ జరిగే చికెన్ విక్రయాల్లో కంటే ఆదివారం రోజు ఎక్కువ అమ్మకాలు ఉంటాయి. అలాంటి సండే రోజే వ్యాపారులకు గుండె మండేలా చేసింది. గత ఆదివారం జరిగిన బిజినెస్‌లో కనీసం 40 శాతం కూడా జరగకపోవడంతో వ్యాపారస్తులు లబోదిబోమంటున్నారు. కాగా వైద్యులు మాత్రం ఇప్పటివరకు మన జిల్లాలో అలాంటి లక్షణాలు కనిపించలేదని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని చెబుతున్నారు.

చికెన్ వ్యాపారం ఢమాల్

- బర్డ్‌ఫ్లూ ప్రచారం ఎఫెక్ట్
- బిజినెస్ లేక నిర్వేదం
- 40 శాతం పడిపోయిన అమ్మకాలు
- ఇలా అయితే కష్టమేనంటున్న వ్యాపారులు

(కడప-ఆంధ్రజ్యోతి): ఒక చికెన్ షాపు నిర్వహణకు దాని స్థాయిని బట్టి నెలకు రూ.50 వేల నుంచి రూ.2 లక్షలకు పైగా మెయింటెనెన్స్ వస్తుంది. అంటే షాపు అద్దె, కరెంటు బిల్లులు, మిషన్ పరికరాలు, అక్కడ పనిచేసే వర్కర్లు ఆ షాపును బట్టి ఉంటుంది. జిల్లాలో సుమారు 2వేల చికెన్ షాపులుంటాయి. వీటిలో పెద్దవి చిన్నవి ఉంటాయి. పెద్దషాపుల్లో కనీసం ఐదు నుంచి పది మంది వరకు పనిచేస్తుంటారు. సరాసరిగా ఒక చిన్న షాపులో ముగ్గురు పనిచేసినా షాపు బాడుగ రూ.10 వేలు, కరెంటు బిల్లు రూ.2 వేలు, షాపులో పనిచేసే ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.12 వేలు ఇచ్చినా రూ.50 వేలు ఖర్చు వస్తుంది. అయితే ఇప్పుడు బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ చికెన్ అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. జిల్లా వ్యాప్తంగా ఆదివారం 150 టన్నుల చికెన్ అమ్మకాలు సాగేవని ఓ అంచనా. అయితే ఈ బర్డ్‌ఫ్లూతో కనీసం 40 శాతం కూడా బిజినెస్ జరగక చికెన్ సెంటర్ల నిర్వాహకుల గుండె గుభేల్‌మంటోంది.

కొంపముంచిన బర్డ్‌ఫ్లూ



ఎక్కడో గోదావరి జిల్లాలో వచ్చిన బర్డ్‌ఫ్లూ వైరస్ అపోహలు మనజిల్లాలో పడింది. వైరస్‌పై లేనిపోని అపోహల కారణంగా చికెన్ వ్యాపారం కుదేలైంది. గత ఆదివారంతో పోలిస్తే 70 శాతం పడిపోయింది. తూర్పుగోదావరి జిల్లా పెరవళి మండలం పానూరు అగ్రహారంలో ఓ వైరస్ కనిపించింది. ఇక ఎక్కడా లేవు. పశువైద్యాధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నప్పటికీ జనాల్లో భయం పోలేదు. గత ఆదివారం ప్రొద్దుటూరులో సుమారు 30 నుంచి 40 టన్నుల దాకా చికెన్ విక్రయాలు జరిగాయి. అయితే ఈసారి పది టన్నులు కూడా జరగలేదు.

- సుమంత్‌రెడ్డి, హోల్‌సేల్ చికెన్‌వ్యాపారి

బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవు



జిల్లాలో ఇప్పటి వరకు కోళ్లలో బర్డ్‌ఫ్లూ లక్షణాలు కనిపించలేదు. జనం భయపడాల్సిన అవసరం లేదు. అపోహలు నమ్మవద్దు. చికెన్ బాగా ఉడికించుకుని తినాలి.

- డాక్టర్ గానుగపెంట రాంబాబు

పడిపోయిన అమ్మకాలు

జనం ప్రస్తుతం ఆరోగ్యంపై బాగా దృష్టి పెడుతున్నారు. అందుకే వ్యాయామం చేసేవారి సంఖ్య పెరుగుతోంది. ఇందులో భాగంగా జనం ప్రోటీన్ ఫుడ్‌కు అలవాటు పడుతున్నారు. దీంతో వెజిటేరియన్స్, ఆకుకూరలు, కూరగాయల వెంట పడుతుండగా నాన్‌వెజ్ ప్రియులు చికెన్, గుడ్లుకు మొగ్గు చూపుతున్నారు. దీంతో వీటి వినియోగం పెరిగింది.

కుటీర పరిశ్రమ

పౌల్ట్రీరంగం అదో పరిశ్రమగా మారింది. జిల్లాలో కోడిమాంసం, గుడ్లు విక్రయాలు బాగా సాగుతున్నాయి. గుడ్లు సాధారణ దుకాణంలో అయినా అమ్ముకోవచ్చు. చికెన్ విక్రయించాలంటే దానికి ప్రత్యేక షాపు ఉండాలి. ఇలా చికెన్ షాపులు జిల్లాలో 2వేలకు పైగా ఉంటాయి. కడపలో సుమారు 700కు పైగా, ప్రొద్దుటూరులో 500, బద్వేలు, పులివెందుల, జమ్మలమడుగు, పోరుమామిళ్ల, వేంపల్లె, ఇతరత్రా అన్నీ 2150 పైగా ఉంటాయి. చిన్నషాపు వేసుకున్నా కూడా ముగ్గురికి ఉపాధి దొరుకుతుంది. వీరికి జీతం రూ.12వేల నుంచి రూ.15వేలు వస్తుంది. అంటే స్థానికంగానే ఉపాధి దొరుకుతుంది. ఇలా కనీసం ఒక్కో దుకాణం రూ.3 వేలు వేసుకున్నా పెద్దచిన్నవి కలుపుకుంటే సుమారు 8 వేల మందికి పైగా ఉపాధి దొరుకుతుంది.

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్

పౌల్ట్రీరంగం పెద్దసవాల్‌గా మారింది. ఏదోక తెగులుతో దెబ్బతింటూ వస్తుంది. అయితే ఈ సారి బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ బాగా పడింది. ఎక్కడో ఉండే బర్డ్‌ఫ్లూ ప్రభావం జిల్లాపై తీవ్ర ప్రభావం చూపింది. జిల్లాలో ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లా నుంచే జిల్లాకు కోళ్లు దిగుమతి అవుతుంటాయి. అక్కడ పెంచిన కోళ్లనే మనకు వినియోగిస్తుంటారు. కడప నగరంలో సాధారణ రోజుల్లో సరాసరి 30 టన్నుల చికెన్ విక్రయాలు ఉంటాయి. ఆదివారం వస్తే 50 టన్నుల వరకు ఉంటుంది. అయితే బర్డ్‌ఫ్లూతో విక్రయాలు పడిపోయాయి. సరే ఆదివారం అయినా బాగుంటుందా అనుకుంటే గత సండేతో పోలిస్తే కనీసం 30శాతం విక్రయాలు లేకపోవడం గమనార్హం. మామూలుగా మటన్ రకాన్ని బట్టి కిలో రూ.800 వరకు ఉంటుంది. అది ఖరీదైనది. దీంతో సామాన్యులు మటన్ కంటే చికెన్‌ను ఎక్కువగా కొనుగోలు చేస్తారు. అయితే బర్డ్‌ఫ్లూతో చికెన్ వ్యాపారం డీలా పడి మటన్ ఊపందుకోవడం గమనార్హం.



● ఇతని పేరు ఖాజా. బద్వేలులోని ఎస్ఎంఆర్ చికెన్‌షాపు నిర్వాహకుడు. ఈయన వద్ద పది మంది కూలీలు పనిచేస్తారు. వీరందరికీ రోజువారి కూలీ చెల్లిస్తాడు. సరాసరిన రూ.8 వేలు చెల్లించాలి. ఇక రూము రెంటు, కరెంటు బిల్లు ఇవన్నీ కలుపుకుంటే కేవలం మెయింటెనెన్స్ ఖర్చే రూ.75 వేలు దాటుతుంది. వ్యాపారం ఉన్నా, లేకున్నా కూడా పనిచేసే వర్కర్లకు కూలీ, కరెంటు బిల్లులు, రూము బాడుగ, రోజువారీ ఖర్చు ఉంటుంది. బర్డ్‌ఫ్లూ కారణంగా వ్యాపారాలు పడిపోయాయి. ఈ లక్షణాలు జిల్లాలో లేకపోయినప్పటికీ పుకార్ల కారణంగా జనం చికెన్ కొనేందుకు జంకుతున్నారు. ఇదే కొనసాగితే పౌల్ట్రీరంగం దారుణంగా దెబ్బతింటుంది. దుకాణాలు మూసుకోవాల్సిందే. బద్వేలులో సరాసరి రోజుకు 5 టన్నుల మేర చికెన్ విక్రయాలు ఉంటాయి. అయితే బర్డ్‌ఫ్లూ దెబ్బతో బిజినెస్ పడిపోయింది.

అవినీతికి పాల్పడితే ఏసీబీకి పట్టిస్తా

- అధికారులకు ఇదే నా లాస్ట్ వార్నింగ్
- ఇలా చేసే వైసీపీ 11 సీట్లకు పరిమితమైంది
- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి): నిజాయితీగా పనిచేయాలంటే తన నియోజకవర్గంలో పనిచేయండి.. లేకపోతే ఏసీబీ అధికారులకు పట్టించి మీ భరతం పడతామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. స్థానిక బద్వేలు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం మైదుకూరు నియోజకవర్గంలోని కొందరు అధికారులకు ఎమ్మెల్యే స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. కొందరు అధికారులు నిజాయితీగా పనిచేస్తున్నారని, కానీ మరికొందరు పనులు చేయకపోగా డబ్బుల కోసం మాత్రం ప్రజలను పీడిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గంలోని రెవెన్యూ, పోలీస్, ఇరిగేషన్, హౌసింగ్, పంచాయతీరాజ్, ఉపాధి, విద్యుత్, మున్సిపల్, రిజిస్ట్రేషన్ తదితర శాఖల్లో పనిచేస్తున్న కొందరు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. తాను నిజాయితీగా పరిపాలిస్తానని నియోజకవర్గ ప్రజలు తనకు ఓటు వేసి ఎన్నుకున్నారని, వారి కోసం తాను మంచి పాలనను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానన్నారు. విద్యుత్‌శాఖలో డబ్బులు ఇవ్వకపోతే ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వడం లేదని, సచివాలయ ఉద్యోగులు కూడా కొందరు సక్రమంగా ఆఫీసుకు రావడం లేదని తన దృష్టికి వచ్చిందని తెలిపారు. రేషన్‌షాపులో రేషన్ సరిగ్గా పంపిణీ చేయకపోయినా డీలర్‌షిప్ కట్ చేస్తామని హెచ్చరించారు. ఇలా అవినీతికి పాల్పడటం వల్లనే వైసీపీ 11 సీట్లకే పరిమితమైందని, ఇక నుంచైనా అధికారులు పనితీరు మార్చుకొని ప్రజలకు పనులు చేయాలని సూచించారు. లేనిపక్షంలో ఇంటికి పంపించేందుకు వెనుకాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, మిల్లు శ్రీను, ధనపాల జగన్, ఆకుల క్రిష్ణయ్య, బీఎన్ శ్రీనివాసులు, కటారి క్రిష్ణ, బండి అమర్‌నాధ్, ధనపాల రవి, తుపాకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి కృషి చేస్తా

- ఇన్‌చార్జి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ప్రసాద్

ఫటాఫట్



సీకేదిన్నె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ లక్ష్యానికి తనవంతు కృషి చేస్తానని జిల్లా నూతన ఇన్‌చార్జి డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె.ప్రసాద్ అన్నారు. రవాణాశాఖ పనితీరు, విధులపై ఆయన 'ఆంధ్రజ్యోతి' ఫటాఫట్ ఇంటర్వ్యూలో పలు విషయాలు మాట్లాడారు.

ప్రశ్న: కడపజిల్లా ఇన్‌చార్జి డీ టీసీగా బాధ్యతలు చేపట్టారు కదా.. మీరు ఏ విధంగా ఫీలవుతున్నారు ?

జవాబు: నేను ఈ జిల్లాలో ఇన్‌చార్జి డీటీసీగా బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉంది. ఎంతో నమ్మకంతో నన్ను ఇక్కడికి తీసుకొచ్చారు. ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చడంతో పాటు ప్రజలకు రక్షణ కల్పించేందుకు కృషి చేస్తా. అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ఫిట్‌నెస్, పర్మిట్ లేని వాహనాలపై ఎటువంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: రోడ్డుమీదకు వచ్చే ప్రతి వాహన చోదకుడు వారి వాహనానికి తప్పనిసరిగా ఫిట్‌నెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్, పర్మిట్లు కలిగి ఉండాలి. లేనిచో తనిఖీల్లో పట్టుబడితే ఆ వాహనాన్ని సీజ్ చేస్తాం.

ప్రశ్న: ఆకతాయిలు అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు కారణం అవుతున్నారు. వారి సంగతేంటి ?

జవాబు: కొందరు వాహనదారులు అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి. అమాయకులు సైతం ఈ ప్రమాదాల్లో గాయపడి మరణించిన సందర్భాలు ఉన్నాయి. స్పీడ్ గన్ ఉపయోగించి వేగాన్ని గుర్తించి కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. రోడ్డు ప్రమాదాలు తగ్గిస్తాం.

ప్రశ్న: కడపలో డ్రైవింగ్ ట్రాక్ లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై మీ స్పందన ?

జవాబు: కడపలో డ్రైవింగ్ ట్రాక్ లేక ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. ఇందుకు సంబందించి స్థలం లేక ఇబ్బందులకు గురవుతున్నారు. కలెక్టర్‌తో మాట్లాడి స్థలం సేకరించేందుకు కృషి చేస్తాం.

ప్రశ్న: ఆధునిక డ్రైవింగ్ ట్రాక్ నిర్మించే యోచనలో ఉన్నారా ?

జవాబు: కడప, ప్రొద్దుటూరు రవాణా శాఖ కార్యాలయాల్లో ఆధునిక మానవ రహిత ఏడీటీఆర్ ట్రాక్ ఏర్పాటు చేస్తున్నాం. దీంతో నైపుణ్యం ఉన్నవారికి మాత్రమే మానవ రహితంగా లైసెన్సు అందించవచ్చు. అదే విధంగా పులివెందుల, బద్వేలులో కూడా ఆధునిక డ్రైవింగ్ ట్రాక్‌లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

ప్రశ్న: దళారుల ప్రభావం అధికంగా ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.. వాస్తవమేనా ?

జవాబు: రవాణా శాఖ వాహనయాప్ ద్వారా అన్ని సేవలను సులభంగా అందిస్తోంది. దళారులను నమ్మి ప్రజలు మోసపోవద్దు. మా సిబ్బంది కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉంటారు. నేరుగా వచ్చి సంప్రదించవచ్చు.



శ్రీకృష్ణదేవరాయలు జయంతి సందర్భంగా కడప నగరంలోని కృష్ణా సర్కిల్ వద్ద కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు హరిప్రసాద్, టింబర్ డిపో శ్రీనివాసులు, తదితరులు

వీరుడు.. ఛత్రపతి శివాజీ మహరాజ్

- నగరంలో అట్టహాసంగా శోభాయాత్ర
- శోభాయాత్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మాధవి



శివాజీ మహరాజ్ శోభాయాత్ర దృశ్యం

కడప కల్చరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): హిందూ సామ్రాజ్య స్థాపన కోసం మనదేశంలోకి వచ్చిన విదేశీ దురాక్రమణదారుల పీచమణచిన వీరుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ అని ఎమ్మెల్యే మాధవి కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతిని పురష్కరించుకుని ఛత్రపతి శివాజీ మరాఠా సేవా సంఘ్, ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు నగర బిల్టప్ సమీపంలోని అంబాభవానీ ఆలయం నుంచి నగర పురవీధుల గుండా శోభాయాత్ర ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హాజరై శివాజీ విగ్రహానికి హారతి ఇచ్చారు. అనంతరం శివాజీ విగ్రహ రథాన్ని ఐక్యవేదిక ప్రతినిధులతో కలిసి లాగారు. గుర్రాలపై కూర్చుని శోభాయాత్రలో జోష్ నింపారు. శోభాయాత్ర 2వ గాంధీ విగ్రహం మీదుగా గోకుల్ సర్కిల్, ఏడురోడ్లు, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, కాగితాలపెంట, నబీకోట, మరాఠీవీధి మీదుగా తిరిగి అంబాభవాని ఆలయానికి చేరుకుంది. శోభాయాత్ర ఆరంభం నుంచి చివరి వరకు నగర ప్రజలు శివాజీ మహరాజ్ విగ్రహానికి అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. శోభాయాత్ర ముందు భాగంలో పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు కాషాయ జెండాలు చేతపట్టి జై బోలో ఛత్రపతి శివాజీ మహరాజ్‌కీ అంటూ మిన్నంటేలా నినదించారు.

ఆకుట్టుకున్న కోలాటం

శోభాయాత్ర ఏడు రోడ్లకు చేరుకోగానే అక్కడ దాదాపు 45 నిమిషాలకు పైగా చింతకొమ్మదిన్నె జగన్ బృందం చెక్కభజన, కోలాటం కళాకారులు వివిధ హిందూ భక్తి పాటలకు వేసిన నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలాగే శోభాయాత్రలో చిన్నారులు అశ్వాలపై కూర్చుని యాత్రలో పాల్గొన్నారు. కాగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో గురుకుల్ విద్యాసంస్థల అధినేత అంబారపు వెంకటేశ్వర్లు, టీడీపీ నేత దుర్గాప్రసాద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జె.వెంకటసుబ్బారెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్, రాష్ట్ర నాయకులు పవన్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం నాయకులు దేవతి శంకరయ్య, మాకం అశోక్‌కుమార్, పాల్గొన్నారు.



అశ్వంపై ఎమ్మెల్యే మాధవి, శ్రీనివాసరెడ్డి



శోభాయాత్రలో గురుకుల్ విద్యాపీర్ వెంకటేశ్వర్లు

కొండలు.. గుట్టల్లో స్థలాలు

- నివాసయోగ్యం కాని చోట స్థలాలు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- ఇళ్లు కట్టుకున్నా నిరుపయోగమే
- లబ్ధిదారుల ఆవేదన
- ఐదేళ్లలో అడుగు పడని కాలనీలెన్నో

7



జీకేరాచపల్లె సమీపంలో గుట్టల మధ్య ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ

అంతిమ యాత్రలోనూ నరకమే..!

- భాకరాపేట శ్మశానవాటికలో ఉద్రిక్తత
- రోడ్డుపై బైఠాయింపు... భారీగా స్తంభించిన ట్రాఫిక్
- కర్రలు, రాళ్లతో దాడి

బద్వేలుటౌన్/రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దేహం విడిచిన ఆత్మకు శాంతి చేకూరాలంటే మృతదేహానికి శాస్త్రోక్తంగా ఖననం చేయాల్సి ఉంటుంది. కానీ అంతిమ యాత్రలోనూ నరకం అనుభవించిన దుస్థితి బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేటలో చోటుచేసుకుంది. చిన్న సమస్య కాస్తా చినికి చినికి గాలివానలా మారి తీవ్ర ఉద్రిక్త వాతావరణానికి దారితీసింది. మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి బైఠాయించడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. కర్రలు, రాళ్లతో ఒక వర్గం వారు మరో వర్గంపై దాడి చేసుకున్నారు. పూర్తి వివరాలిలా..

బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేట గ్రామస్థులు తమ పూర్వీకుల నుంచి అక్కడే నివాసముంటూ, ఎవరైనా చనిపోతే వారిని భాకరాపేట చెరువు తట్టు సమీపంలో మృతదేహాన్ని ఖననం చేసి అంత్యక్రియలు చేసేవారు. 1566 సర్వే నెంబరులో 14.85 ఎకరాల భూమి ఉండేది. అయితే సీపీఐ, సీపీఎం నాయకులు ఈ శ్మశానస్థలాన్ని ఆక్రమించి ఆరు నెలల క్రితం గుడిసెలు వేశారు. ఆ గ్రామస్థులు పదే పదే అధికారులకు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా ఆదివారం భాకరాపేట గ్రామానికి చెందిన యానకి సుబ్బమ్మ (70) అనారోగ్యంతో చనిపోగా, ఆ మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకొచ్చారు. కానీ శ్మశానాన్ని ఆక్రమించి గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులు సీపీఐ, సీపీఎం నాయకుల అండదండలతో మృతదేహాన్ని అడ్డుకున్నారు. అనంతరం వారిపై దాడిచేసి గాయపరిచారంటూ గ్రామస్థులంతా కలిసి కడప-బద్వేలు ప్రధాన రహదారిపై బైఠాయించి వాహనాలను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్థులంతా పోలీసులను చుట్టుముట్టి వారికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. వెంటనే పోలీసులు వారికి సర్దిచెప్పి ట్రాఫిక్‌ను క్లియర్ చేసి శ్మశానవాటిక వద్దకు గ్రామస్థులతో పాటు పోలీసులు కూడా వెళ్లారు. పోలీసులతో గ్రామస్థులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గ్రామంలో ఎవరినైనా చనిపోతే శ్మశానవాటికలోనే ఖననం చేసి అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని, ఇప్పుడు ఎక్కడ పూడ్చుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అంతలోనే సీపీఐ, సీపీఎం నాయకులు అక్కడకు చేరుకోవడంతో ఇరువర్గాలు వాగ్వాదానికి దిగారు. గుడిసెవాసుల్లోని ఒక యువకుడు పెట్రోలు పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తన వెంట తెచ్చుకున్న పెట్రోలు అటు పోలీసులు, ప్రజలపై పడటంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పింది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు కర్రలు, రాళ్లతో దాడిచేసుకునే పరిస్థితి నెలకొనడంతో పోలీసులు అందరినీ చెదరగొట్టారు. ఎట్టకేలకు గ్రామస్థులంతా ఏకమై అడ్డువచ్చిన వారిని తోసుకుంటూ వెళ్లి మృతదేహాన్ని అక్కడే ఖననం చేశారు. మరింత మంది పోలీసు బలగాలు అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకురావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులకు సర్దిచెబుతున్న పోలీసులు



కమ్యూనిస్టు పార్టీ నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట



మృతదేహాన్ని ఖననం చేయకుండా అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించిన గ్రామస్థులు, కుటుంబసభ్యులు



కర్రలతో, రాళ్లతో ఘర్షణపడుతున్న గుడిసెవాసులు, గ్రామస్థులు

గడ్డివాములు, బైకులు దగ్ధం



వేంపల్లెలో దగ్ధమవుతున్న గడ్డివాములు

వేంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె పట్టణం పులివెందుల-రాయచోటి రోడ్డులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండు గడ్డివాములు, బైకులు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లింది. షేక్ దూద్‌పీర్ గడ్డివ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తుంటారు. ఆదివారం ఉదయం ఎవరో నిప్పుపెట్టడంతో మంటలు ఎగిసపడ్డాయి. చుట్టుపక్కల వారు ఫైరింజన్‌కు సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పేందుకు ప్రయత్నించగా... రెండు గడ్డివాములు పక్కనే పార్క్ చేసి ఉంచిన బైకులు కాలిపోయాయి. అగ్నిప్రమాదంతో తీరని నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు దూద్‌పీర్ కోరుతున్నాడు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సరోజినీనగర్‌లో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. సరోజినీనగర్‌లో నివాసం ఉంటున్న షేక్ షబ్బీర్ (35) టైల్స్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని సంవత్సరాలుగా మద్యంకు అలవాటుపడి పనికిపోయి వచ్చిన డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా తాగుతూ ఉండేవాడు. ఈక్రమంలో శనివారం అర్ధరాత్రి మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి మృతుడి భార్య షకీలా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇరువురు పిల్లలు ఉన్నారు.

వృద్ధురాలు ఆత్మహత్య

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం సరోజినీనగర్‌కు చెందిన ఓ వృద్ధురాలు ఆదివారం తలకు పూసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు రిమ్స్ సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. సరోజినీనగర్‌కు చెందిన గురజాల చంద్రమ్మ (78) గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్య ససమ్యలతో బాధపడుతోంది. ఈమెకు కొడుకు ఇరువురు ఆడబిడ్డలు ఉన్నారు. అనారోగ్యం బాగుకాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెంది తలకు పోసుకునే రంగు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించి.. మృతురాల కుమారుడు గోపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొండలు.. గుట్టల్లో స్థలాలు

- నివాసయోగ్యం కాని చోట స్థలాలు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- ఇళ్లు కట్టుకున్నా నిరుపయోగమే.. లబ్ధిదారుల ఆవేదన
- ఐదేళ్లలో అడుగు పడని కాలనీలెన్నో

సుండుపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇళ్లు కాదు ఊళ్లు కడుతామంటూ గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసింది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. నాయకులు కాసులు పోగేసుకునేందుకు నివాసయోగ్యం కాని, దారీ తెన్ను లేని స్థలాలు, కోర్టు వివాదాల్లోని జాగాలు ఎంపిక చేయడంతో నిర్మాణాలకు అడుగుపడని పరిస్థితి. ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఉంటారా లేదా అన్న ఆలోచన లేకుండా వాటి అభివృద్ధికి లక్షలు పోసి ప్రభుత్వ ధనాన్ని వృధా చేశారు. విలువైన ప్రభుత్వ స్థలాలను వైసీపీ మద్దతుదారులకు, వైసీపీ కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. అర్హులైన నిరుపేదలకు మాత్రం నివాసయోగ్యం కాని స్థలాలను అందజేయడంతో లక్షలు ఖర్చు పెట్టి ఇంటి నిర్మాణం చేసినా నిరుపయోగమేనన్న భావనతో చాలా చోట్ల జగనన్న కాలనీలో ఒక్క ఇంటి నిర్మాణం కూడా ప్రారంభం కాలేదు.

కనీసం దారి కూడా లేదు..


సుండుపల్లె మండల వ్యాప్తంగా 22 జగనన్న కాలనీ లేఅవుట్లను పాలకుల ఆదేశానుసారం ప్లాట్లు ఏర్పాటు చేశారు. దాదాపు రెండు, మూడు లేఅవుట్లు మినహా మిగిలిన అన్ని లేఅవుట్లు గుట్టల్లో, కొండల్లో, చెరువుల సమీపంలో ఏర్పాటు చేశారు. మడితాడు గ్రామ పంచాయతీ జీకే రాచపల్లికు దూరంగా గుట్ట కింద భాగంలో సర్వే నెంబర్ 637లో 23 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి ఇంటి పట్టాలు కేటాయించారు. రెండు గుట్టల మధ్యలో ఇంటి నిర్మాణానికి ఎటువంటి అవకాశం లేని చోట ప్లాట్లు వేసి పట్టాలు పంపిణీ చేశారు. అక్కడికి వెళ్లేందుకు కనీసం దారి కూడా లేదు. నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ ఇప్పటి వరకు కనీసం పునాదులు కూడా వెయ్యలేదు. ఆ స్థలం ఎందుకు పనికిరాదని ఇంటి నిర్మాణానికి అనువైన స్థలం కాదని లబ్ధిదారులు వాపోతున్నారు. మరో చోట కంచిపాటివాండ్లపల్లె సర్వే నెంబరు 2475లో సుండుపల్లె మండల కేంద్రానికి చెందిన మైనార్టీలు, దళితులు ఇతరులు 26 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలు పంపణీ చేశారు. అయితే మండల కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్లు దూరంగా గుట్టలో పెద్ద పెద్ద బండ రాళ్లు ఉన్న చోట లేఅవుట్ వేసి.. ఆర్భాటంగా ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఎటువంటి వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు ఎవరూ ఇంటి నిర్మాణానికి మొగ్గు చూపలేదు. ఈ విధంగా చాలా లేఅవుట్లలో ఇప్పటి వరకు అడుగు పడలేదంటే అర్హులను వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా మోసం చేసిందో తెలుస్తోంది.



గాండ్లపల్లి జగనన్న కాలనీలో కోర్టు వివాదాలతో ఆగిన నిర్మాణాలు

అర్హులకు కోర్టు వివాదాలు అదనం

అర్హులమని గుర్తించి ఇచ్చిందే ఒకటిన్నర సెంటు.. పైగా కోర్టు వివాదాల్లో ఉన్న స్థలాల్లో జగనన్న కాలనీ లేఅవుట్లు వేసి వివాదాలను అదనంగా ఇచ్చారా అని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో గాండ్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్‌లో 81 మంది లబ్ధిదారులకు పట్టాలిచ్చారు. ఆ స్థలం కోర్టులో ఉన్నా కూడా పట్టించుకోకుండా పట్టాలు పంపిణీ చేయడంతో అక్కడ నిర్మాణాలు ఆగిపోయాయి. చాలా మంది అర్హులు గుంతలు తీసి పునాదులు నిర్మించారు. స్థానికులు కోర్టుకు వెళ్లడంతో ఆ స్థలం వివాదాస్పదంగా మారి నిర్మాణాలు ఆగిపోయాయి. పైగా పట్టాలిచ్చిన అధికారులు పాలకుల దగ్గరికి వెళితే.. మేమేం చేయాలి వాళ్లు కోర్టుకు వెళ్లారని చేతులెత్తేశారంటూ లబ్ధిదారులు వాపోతున్నారు. ఎల్లారెడ్డిగారిపల్లె సమీపంలో 1387 సర్వే నెంబర్‌లో లేవుట్ వేశారు. ఆ లేఅవుట్‌లో సుమారు 52 మంది అర్హులకు ప్లాట్లు పంపిణీ చేశారు. లేఅవుట్ వేయకముందే అక్కడ పెద్ద పెద్ద మామిడిచెట్లను రైతులు సాగు చేసి ఉన్నారు. పేపర్లపై లేఅవుట్లు తీసి అర్హులకు పట్టాలు పంపిణీ చేశారు. పట్టాలిచ్చి దాదాపు నాలుగేళ్లు పూర్తయినా ఇప్పటికీ ఇంటి స్థలం చూపించలేదు. ఇంటి స్థలం చూపించాలని ఇప్పటికీ లబ్దిదారులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. 20 రోజుల క్రితం జరిగిన రెవెన్యూ సదస్సులో కొంత మంది లబ్ధిదారులు ఈ సమస్యను పరిష్కరిస్తే ఇళ్లు నిర్మించుకుంటా మంటూ రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు అందజేశారు.



జీకేరాచపల్లె సమీపంలో గుట్టల మధ్య ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ



పట్టాలిచ్చారు.. స్థలం చూపించలేదని
ఇంటి పట్టాలు చూపుతున్న లబ్ధిదారులు (ఫైల్‌ఫొటో)

నెల రోజుల క్రితం ఫిర్యాదు చేశాను



నెల రోజుల క్రితం రెవెన్యూ సదస్సులో పట్టా ఇచ్చారు. ఇంటి స్థలం చూపించలేదని ఫిర్యాదు చేశాను. గత మూడు సంవత్సరాలుగా ఇంటి స్థలం చూపించమని రెవెన్యూ అధికారులు చుట్టూ తిరుగుతున్నా ఎవ్వ రూ పట్టించుకోవడం లేదు. కూటమి ప్రభుత్వంలో కూడా అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఇంటి స్థలం చూపించడం లేదు.

-శివయ్య, లబ్ధిదారుడు, సుండుపల్లె

చాలా చోట్ల ప్రారంభించలేదు

చాలా చోట్ల జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. త్వరగా ఇంటి నిర్మాణం ప్రారంభించి పూర్తి చేయాలని లబ్ధిదారులకు తెలియజేశాము. త్వరగా పూర్తి చేస్తే సకాలంలో బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

-నాగరాజునాయక్, హౌసింగ్ ఏఈ, సుండుపల్లె

అక్షర తపస్వి భూతపురి

- వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి



భూతపురి పురస్కార సత్కారం అందుకుంటున్న పుత్తా పుల్లారెడ్డి

కడప కల్చరల్ ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి) : కవితా రచనను ఒక తపస్సులా భావించి అనేక మహాకావ్యాలను రచించిన అక్షర తపస్వి డాక్టర్ భూతపురి సబ్రహ్మణ్యశర్మ అని యోగివేమన విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సమావేశ మందిరంలో డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మోమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్య పీఠం సంయుక్త ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భూతపురి సాహితీకృషి విశిష్టమైనదన్నారు. ఆయన 1953లో కవిగా సాహితీరంగంలో అడుగుపెట్టి 2002 వరకూ అంటే దాదాపు 5 దశాబ్దాలపాటు తనదైన విలక్షణతో సాహితీసేవ చేశారన్నారు. పుత్తా పుల్లారెడ్డి వృత్తిరీత్యా ఇంజనీరైనప్పటికీ విమర్శకుడిగా, వ్యాఖ్యాతగా, అనువాదకుడుగా ప్రసిద్ధుడన్నారు. ఆయనను భూతపురి స్మారక పురస్కారంతో సత్కరించడం అభినందనీయమన్నారు.

అనంతరం సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య జి.విశ్వనాథకుమార్ మాట్లాడుతూ భూతపురి తెలుగులోనే కాకుండా సంస్కృతంలో రచనలు చే శారన్నారు. కార్యక్ర మంలో ఆకాశవాణి పూర్వ సంచాలకులు ఆకుల మల్లేశ్వరరావు, బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, వైవీయూ పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుపై అవగాహన అవసరం



ర్యాలీ చేస్తున్న హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ అధికారులు

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ చీఫ్ డిపో మేనేజరు సతీష్‌కు మార్ అన్నారు. కడప మహావీర్ సర్కిల్ నుంచి హిందు స్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లీన్ అండ్ క్లీన్ ఎనర్జీ ద్వారా చమురు దిగుమతులు తగ్గించడంలో సహాయపడేందుకు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం పౌరులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. సీనియర్ రీజనల్ మేనేజరు మన్మ. దరావు, గంగన్న, ఓబన్న పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్

వేంపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): గుంటూరులోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన విజ్ఞాన్ మహోత్సవ్‌లో సాహిత్య కళాపోటీల్లో ఇడుపుల పాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ప్రతిభ చూపారు. క్విజ్‌పోటీల్లో రెండోస్థానం, మాస్టర్ ఓరేటర్‌లో మూడో స్థానం, శాస్త్రీయ, సంగీత పోటీల్లో మూడోస్థానం, తైక్వాండోలో రెండోస్థానం సాధించారని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. ప్రతిభ చూపి అవార్డులు పొందిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు జీవన్, శ్రీమన్నార్, అఖిల్, కైసిఫ్, అహ్మద్, రూపశ్రీ, సంతోషిణి, ప్రణతి, లిఖి తాంజలి, విజయభాస్కర్, అఖిల, సిద్దార్థ, కులశేఖర్, కార్తీక్, యజ్ఞ తదితరులను అభినందంచారు.


ప్రజా సంక్షేమాన్ని విస్మరిస్తున్న పాలకులు : సీపీఎం

కడప సెవెన్ రోడ్స్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ విమర్శించారు. ఆదివారం రామకృష్ణ నగర్ సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగిన విస్తృతస్థాయి సమావేశానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజానీకాన్ని కదిలించి రానున్న రోజుల్లో ఆందోళనలకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాలకు విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు కూటమి ప్రభుత్వ నాయకులకు గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కడప జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని విభజన హామీలలో స్పష్టంగా పేర్కొన్నారని.. ఇపుడు విస్మరించడం తగదన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేసే రకంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పన చేసి.. సామాన్య, పేద, మధ్యతరగతి వర్గాలను విస్మరించిందన్నారు. రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలు అమలు కోసం ఉద్యమబాట పడతామని తెలిపారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్

శివకేశవులు అబేధ్యం...



వీరగల్లు విగ్రహాలు

వల్లూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశిగా విరాజిల్లుతున్న పుష్పగిరి క్షేత్రంలో శివకేశవులిద్దరూ అబేధ్యమని చెబుతున్న రెండు వీరగల్లుల విగ్రహాలు ఉన్నాయని రచయిత, చరి త్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేశ్ పేర్కొన్నారు. ఆయన ఇటీవల పుష్పగిరి క్షేత్రంలో పర్యటించి.. ఇందుకు సంబంధించి వివరాలు తెలిపారు. ఒక వీరగల్లు విగ్రహం పెన్నా(పినాకిని) నది ఎడమ వైపు కొండపై ఉన్న శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణం పక్కగా ఉంది. మరో విగ్రహం పెన్నానదికి కుడివైపు ఉన్న పుష్పగిరి గ్రామంలోని శ్రీవైద్యనాథస్వామి ఆలయంలో ఉంది. రెండు విగ్రహాల్లోని వీరుడు గుర్రంపై ఉన్నారు. ఒకవిగ్రహంలోని వీరుడు ఎడమ వైపు గుర్రాన్ని పట్టుకుని కుడి చేతిలో అద్భుతమైన ఆయుధాన్ని పట్టుకుని ఉన్నారు. ఇంకో విగ్రహంలో వీరుడు ఖడ్గాన్ని ధరించి ఉన్నారు. రెండు విగ్రహాల్లో వీరులు కొప్పులు ధరించి ఉన్నారు. ఈ రెండు విగ్రహాల్లో మధ్యన చతురస్రాకార గదిలో మరణించిన వీరుని తీసుకువెళుతున్న అప్సరసలు అద్భుతంగా కానవస్తున్నారు. శ్రీలక్ష్మి చెన్నకేశవ స్వామి ఆలయ సముదాయ ప్రాంగణంలోని వీరగల్లు పూర్తిగా శైవుల శైలిలో ఉంది. కానీ వైద్యనాథస్వామి ఆలయంలోని వీరగల్లులో అర్ధచంద్రాకృతిలో ఉన్న భాగంలో వీరుడు తలపై కిరీటాన్ని ధరించి వైష్ణవశైలిలో కనబడుతున్నాడు. ఈ విగ్రహంలో చతురస్రాకార గది పార్శ్వభాగాల్లో దీప కలశాలు చెక్కబడి ఉండడం విశేషం. ఇదే విగ్రహం పైభాగంలో అర్ధచంద్రాకృతిభాగంలో రెండు వైపులా పూర్ణ కుంభాలుంటూ అబ్బురపరుస్తోంది. ఈ రెండు విగ్రహాల్లో పైవైపు శివలింగం ఉంది. లింగానికి పక్కగా ఒక విగ్రహంలో కొప్పు ధరించి వీరుడు శివైక్యం పొందారు. ఇంకో విగ్రహంలో వీరుడు కిరీటాన్ని ధరించి వైష్ణవ సాంప్రదాయంలో ఉండి వైకుంఠ ప్రాప్తి పొందారు. పుష్పగిరిలోని ఈ రెండు వీరగల్లుల విగ్రహాలు చాలా దగ్గిరి పోలికలను చూపుతున్నాయి. శివకేశవులు ఇద్దరూ ఒకటేనని ఆనాటి శిల్పులు తమ శిల్పకళా నైపుణ్యంతో చెప్పకనే చెబుతున్నారని చరిత్రకారుడు వివరించారు.

ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే ఆందోళన



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమని మెప్మా యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి విజయలక్ష్మి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షురాలు సుజాత అధ్యక్షతన జరిగిన మెప్మా ఆర్పీల సమావేశం నిర్వహించారు.

ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను తక్షణం రద్దు చేయాలన్నారు. మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీకి ప్రభుత్వం కట్టుబడి త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలన్నారు. ఆర్పీలను ప్రభు త్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఆర్పీల ఉద్యోగ భద్రతకు ముప్పు కలిగించే విధంగా సీఓ అధికారుల నుంచి బెదరింపులు రాకుం డా చూడాలన్నారు. ముఖ్యంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు, సీఓల నుంచి వస్తున్న ఒత్తిళ్లు, బెదిరింపులను ఆపాలన్నారు. ప్రధానంగా ఆర్పీలను ప్రభుత్వ కార్యకలాపాల్లో మాత్రమే పాల్గొనే విధంగా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. పెం డింగ్‌లో వున్న వేతనాలను తక్షణం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎన్. విజయలక్ష్మి, నాయకులు వేణుగోపాల్, సుబ్బరాయుడు, చంద్రకళ, క్రాంతి, కళావతి, పద్మావతి, విజయ్‌కుమారి, ఆరుణ, రమాదేవి, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అడవికి నిప్పు... చెలరేగిన మంటలు

- సన్ననిమ్మ తోటలకు వ్యాప్తి..
- 150 చెట్లు దగ్ధం



అడవికి నిప్పుపెడుతున్న కాలిపోతున్న దృశ్యం



కాలిపోయిన చెట్లను చూపుతున్న రైతు మహబూబ్‌బాషా

చక్రాయపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చక్రాయపేటకు సమీపంలోని అటవీప్రాంతంలో ఆదివారం గుర్తు తెలియని వ్యక్తు లు నిప్పు పెట్టడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. దీంతో అడవికి సమీపంలోని సన్ననిమ్మ తోటలకు ఉన్న కంచెకు అంటుకొని తోటల్లోని దాదాపు 150 చెట్లు దగ్ధమయ్యాయి. షేక్ మహబూబ్ బాష (యమగోల)కు చెందిన 100 చెట్లు, మహబూబ్ పీరా, ఇబ్రహీం అనే రైతులకు చెందిన 40 చీనీచెట్లు, అరకెరా వరి పంటతో పాటు వైర్లు, పైపులు కాలిపోయాయని తెలిపారు. దాదాపు రూ.3లక్షల నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నారు. ఈ సమాచారం తెలిసిన సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కాగా, తరుచూ అగ్ని ప్రమాదాలతో అటవీ ప్రాంతాలలో ఉన్న రైతులు భయాందోళన చెందుతున్నారు. గత వారంలో ఇదే ప్రాం తంలో చీనీచెట్లు, పైపులు, వైర్లు కాలిపోయాయి. ఇప్పటికైనా అధికారులు అగ్నిప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని.. ప్రభుత్వం నష్టపోయిన వారికి పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

● 58 ప్రైవేట్ కంపెనీల ద్వారా 5702 ఉద్యోగాల కల్పన
● 7 వేల మందికి పైగా నిరుద్యోగులు హాజరు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థ సీడాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ మెగా జాబ్‌మేళలో 58 కంపెనీలు తమ ప్రాతినిధ్యాన్ని వహించగా దాదాపు 7వేలకు పైగా నిరుద్యోగులు హాజరయ్యారు. 5702 ఉద్యోగాలు కల్పించనున్నారు. ఆదివారం కడప నగరం శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆర్.మాధవి ప్రారంభించారు. రాయలసీమ వ్యాప్తంగా నిరుద్యోగులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఫుడ్, ఇన్సూరెన్స్, ఆటో, ఐటి, ఫార్మా, ఫైనాన్స్, హోటల్, టెలికాం, రిటైల్, ట్రాన్స్‌పోర్ట్, వైద్య, బ్యాంకింగ్, ఎడ్యుకేషన్ తదితర రంగాలలో పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు ఖాళీలుండగా ఎల్ఎమ్ఎస్ కార్పొరేట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ 150 ఉద్యోగాలను, ఇంటెల్ సర్వ్ ఐటి సొల్యూషన్స్ 30 ఉద్యోగాలను అందుబాటులో ఉంచాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ కడప నియోజకవర్గంలో చాలా మంది నిరుద్యోగ యువత ఉన్నారన్నారు. ఈ జాబ్ మేళా ద్వారా కొంత మందికి ఉద్యోగాలు లభించినా సంతృప్తి కలుగుతుందన్నారు. పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థ సీడాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు నిరుద్యోగుల నుంచి విశేష స్పందన రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఏడాది ఫిబ్రవరిలో నిరుద్యోగుల కోసం జాబ్ మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు.

పాఠశాల విద్యాశాఖ నాన్ టీచింగ్ స్టాఫ్ జిల్లా కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గం ఇదే...

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లా స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ నాన్‌టీచింగ్ స్టాఫ్ జిల్లా సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ సంఘానికి ఎలక్షన్ ఆఫీసర్‌గా శ్యామ్, ఎలక్షన్ అబ్జర్వర్‌గా బలరాం, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా లోకేశ్వర్‌రెడ్డి వ్యవహరించారు.నాన్‌టీచింగ్ స్టాఫ్ జిల్లా అధ్యక్షుడిగా ఎం.రమేష్ (సీనియర్ అసిస్టెంట్ డీఈఓ ఆఫీస్, కడప) జిల్లా ప్రధాన కార్యదర్శిగా కె.సాయి ఫణీంద్ర, (జూనియర్ అసిస్టెంట్, డీఈఓ ఆఫీస్, కడప) ఎంపికయ్యారు. కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు సాయంత్రం 4 గంటలకు ముగించాలి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు నిర్వహించే క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలు నాలుగు గంటలకు ముగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు మధ్యాహ్నం వరకు పాఠశాలలో ఉండి క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాలకు 1 గంటకు చేరుకోవాలని చెప్పడం ఉపాధ్యాయులకు ఇబ్బందిగా ఉందన్నారు. పాఠశాల సమయం నాలుగు గంటలకే ముగించాల్సి ఉండగా కాంప్లెక్స్ మీటింగ్ పేరుతో ఐదు గంటల వరకు పెంచడమే కాకుండా ఐదున్నర గంటల వరకు అటెండెన్స్ పడకుండా చేయడం చాలా బాధాకరమన్నారు. జిల్లా గౌర అధ్యక్షులు కొప్పూరి నాగరాజు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శ్రీనివాసులు, బి.చంద్రశేఖర్, కార్యదర్శులు ఎల్వీ రవిశంకర్, అబ్దుల్ సలాం, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

నడకతో శరీరానికి, మనస్సుకు ఎంతో మేలు

కడప ఎర్రముక్కపల్లె, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు ఉదయం నడకతో ఎంతో మేలని, దీన్ని మనలో ఒక భాగంగా చేసుకోవాలని కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప ఆర్‌పీసీటీడబ్ల్యూఏ ఆధ్వర్యంలో కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి మహావీర్ సర్కిల్ వరకు నిర్వహించిన 10కె మారథాన్ రన్‌లో కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని మారథాన్‌ను ప్రారంభించారు.

'వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి'

కడప మారుతీనగర్ ఫిబ్రవరి 16, (ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లును తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు సత్తార్, ధర్మపరిచయ కమి టీ నాయకుడు బాబు భాయ్ కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరల సమావేశంలో వారు మాట్లాడారు. 1954లో కాంగ్రెస్ పార్టీ వక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చి తద్వారా వక్ఫ్ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ముస్లింలకు ఆర్థికంగా ఉపయోగపడే వక్ఫ్ చట్టాన్ని బలహీన పరచే కుట్రకు తెరతీయడం సరైందికాదన్నారు.

స్టైఫండ్ రూ.24వేలకు పెంచండి

కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వెటర్నరీ విద్యార్థులకు స్టైఫండ్ రూ.7వేల నుంచి రూ.24వేలకు పెంచాలని ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం హోచిమెన్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జి.వలరాజు జిల్లా అధ్యక్షులు కె.శివశంకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వెటర్నరీ ఎన్టీఆర్ పశువైద్య విద్యార్థులు గత పది రోజుల నుంచి స్టైఫండ్ రూ.24వేలకు పెంచాలని వారి తరగతులను బైకాట్ చేసి నిరవధిక దీక్ష చేస్తున్నారన్నారు. ఈ దీక్షకు ఏఐఎస్ఎఫ్ సంపూర్ణ మద్దతు తెలియజేసింది.

ప్రమాదాలకు నిలయంగా పుష్పగిరి రోడ్డు

● అతివేగంగా వెళుతున్న వాహనదారులు
● వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని వినతి





పుష్పగిరి రోడ్డు కూడలి.. పుష్పగిరి రోడ్డుపై వెళుతున్న ఇసుక ట్రాక్టరు

చెన్నూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): పవిత్ర క్షేత్రమైన పుష్పగిరికి వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. దీంతో పర్యాటకులు, ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. పుష్పగిరికి డబుల్ రోడ్డు వేయాలని గత టీడీపీ పాలనలో టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి అధికారులకు తెలిపారు. ఆ మేరకు ప్రయత్నాలు కూడా జరిగాయి. అయితే నిధులు మంజూరు కాలేదు. అనంతరం వైసీపీ పాలనలో చివరి ఏడాదిలో రూ.9 కోట్ల నిధులను అప్పటి మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ మధుసూదనరెడ్డి మంజూరు చేయించగా కడప - కర్నూలు హైవే రహదరి నుంచి ఉప్పరపల్లె మీదుగా పుష్పగిరి రోడ్డు వరకు రెండు చోట్ల చిన్నపాటి వంతెనలు, కొంత మేర డబుల్ రోడ్డు ఏర్పాటు చేశారు. వాహనదారులు అతి వేగంగా వెళుతుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక ప్రమాదంలో కారు, ఆటో ఢీకొనగా ఒకరికి చేతులు విరిగాయి. అంతేకాక పలుమార్లు ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు ఢీకొన్న సంఘనలు ఉన్నాయి. ఆదివారం అయితే ద్విచక్రవాహనదారులు మరీ ఎక్కువ మిగిలిన రోజులకంటే ఆదివారం ఆటవిడుపు కావడంతో పుష్పగిరి, ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు వాహనదారులు ఎక్కువగా వస్తుంటారు. వీరి వేగానికి కాస్త నెమ్మదిగా వెళ్లే వాహనదారులు బెంబేలెత్తిపోవాల్సిన పరిస్థితి ఉంటోంది. ఈ దారిలో పంట పొలాలున్నాయి. రైతులు తిరుగుతుంటారు. ఆలయలకు భక్తులు వస్తుంటారు. వీరంతా వాహనదారుల వేగానికి ఆందోళన చెందుతున్నారు. ద్విచక్ర వాహనంపై ఒకరు, లేదా ఇద్దరు వెళ్లాల్సి ఉండగా నలుగురు కూడా వెళుతుంటారు.

మితిమీరిన వేగంతో ఇసుక ట్రాక్టర్లు



అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్ల డ్రైవర్లు మితిమీరిన వేగంతో వెళుతుంటారు. శివాలపల్లె, పుష్పగిరి సమీపంలో ఇసుకను ట్రాక్టర్లలో నింపుకుని ఉప్పరపల్లె మీదుగా కాకుండా గోపవరం క్రాస్ రోడ్డు మీదుగా వల్లూరు మండలానికి అత్యంత వేగంగా తీసుకెళుతుంటారు. వారి వేగానికి అటుగా వెళ్లే వారు బెంబేలెత్తుతున్నారు.

\- పి.అయ్యవారురెడ్డి, నరసారెడ్డిపల్లె

ఎన్నిసార్లు చెప్పినా ఇంతే..



పుష్పగిరికి, ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు వచ్చి వెళ్లేవారు వేగం తగ్గించుకోవాలని చెప్పినా వినడం లేదు. ప్ర మాదం జరుగుతుందని పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు. పుష్పగిరి రోడ్డున ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు, కార్లు తిరగడం రోజురోజుకూ ఎక్కువవుతోంది. ఆయా వాహనాల డ్రైవర్లు శరవేగంగా దూసుకుపోతుంటారు. ఎంతచెప్పినా పట్టించుకోవడం లేదు. మరీ దారుణంగా తయారయ్యారు. కావున అధికారులు ఈ దారిలో తనిఖీలు చేపట్టాల్సిందే. లేకుంటే ప్రమాదాలు ఎక్కువవుతాయి. ఇప్పటికే చిన్నచిన్న ప్రమాదాలు జరిగాయి. ప్రాణాలు గాలిలో కలిసిపోకముందే అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

\- ఎం.సుదర్శనరెడ్డి, సర్పంచ్, శివాలపల్లె

పరిశీలించి స్పీడ్‌బ్రేకర్లు వేస్తాం

పుష్పగిరి రోడ్డును పరిశీలిస్తాం. అవసరమైతే స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేస్తాం. బుద్దాయపల్లె, గోపవరం రెండు గ్రామాలు పుష్పగిరి రోడ్డులో కలుస్తాయి కాబట్టి ఈ రెండు వైపులా వచ్చే వాహనదారులు ఎవరైనా తమ వాహనాల వేగం తగ్గించుకోవాలి. ప్రమాదాల నివారణకు అది కూడా కొంతవరకు దోహదపడుతుంది. రోడ్డును పరిశీలించి అవసరమైతే స్పీడ్ బ్రేకర్లు కూడా వేయిస్తా.

\- కళ్యాణి, డీఈ ఆర్‌అండ్‌బీ

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే చర్యలు : సీఐ



విద్యార్థినులకు సలహాలు, సూచనలు ఇస్తున్న సీఐ రోషన్

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ఈవ్ టీచింగ్, ఆకతాయి పనులకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ ఎస్‌కే రోషన్ హెచ్చరించారు. ఆదివారం ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటేశ్వర్లు సహకారంతో కమలాపురం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలల్లో ర్యాగింగ్‌పై అవగాహన కల్పించారు. అక్కడే పాఠశాల, కళాశాల విద్యార్థులు సిబ్బందితో మాట్లాడిన ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వల్ల ఏవైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈవ్‌టీజింగ్ వల్ల చాలా మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయని, ఎంతో మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆయన గుర్తు చేశారు. అనంతరం విద్యార్థుల వసతి గదులను సందర్శించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపాల్ తులశమ్మ, ఉపాధ్యాయులు అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఇవ్వాలి'



నూతన కమిటీతో జిల్లా అధ్యక్షుడు ఓబులపతి

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి దళిత, గిరిజన కుటుంబానికి మూడు ఎకరాల వ్యవసాయభూమి ఇవ్వాలని దళిత భూ సాధన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పెద్దులపల్లి ఓబులపతి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక బసవతారకం లా కాలేజిలో సమితి నూతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ దళితులకు ఇంటి నివేశ స్థలంతో పాటు భూములు లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధనవంతులైన వారు భూ ఆక్రమణలు చేసి వందల ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జాచేసి దర్జాగా ఉన్నారని ఆరోపించారు. కానీ ఎస్సీ, ఎస్టీలకు సెంటు భూమి ఇవ్వడానికి నిబంధనలు చెబుతారని నిప్పులు చెరిగారు.

నూతన కమిటీ ఏర్పాటు

దళిత భూ సాధన పోరాట సమితి అధికార ప్రతినిధిగా ఏ. బాబు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా ఆర్.ఎన్.రాజు, ప్రధాన కార్యదర్శిగా సుబ్బారావు, సహాయ కార్యదర్శిగా నాగేంద్ర, కార్యదర్శిగా చింతకాయల మోహన్, కార్యవర్గ సభ్యులుగా రెడ్డయ్య, వెంకటసుబ్బయ్య, తదితరులున్నారు.

బాలికల సదనంను సందర్శించిన డీఎస్పీ



బాలసదనం పిల్లలతో డీఎస్పీ రమాకాంత్

కడప క్రైం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కడప నగరంలోని అక్కాయపల్లెలోని స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాల సదనంను ఆదివారం కడప మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్ సందర్శించారు. ఇందులో 13 మంది బాలికలు ఉన్నారు. సదనంలో బాలికల వసతి, సౌకర్యాలు, ఆహారం, నిద్రించే హాలు, టాయిలెట్స్, కిచెన్ వంటి వాటిని పరిశీలించి తగు సూచనలు చేశారు. సీసీ కెమెరాలు, రాత్రి వాచ్‌మెన్ గురించి ఆరా తీశారు. అలాగే చిన్నచౌకులోని కొండాయపల్లె శిశు గృహాన్ని కూడా సందర్శించగా అక్కడ రెండేళ్ల లోపు వయస్సున్న ముగ్గురు అనాథ బాలురకు వసతి కల్పించినట్లు గుర్తించామని ఆయన తెలిపారు.

అరుణకుమారికి డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని సోషియాలజీ విభాగం పరిశోధక విద్యార్థిని ఐ.అరుణకుమారికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లం నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్సిటీలో సోషియాలజీ విభాగానికి చెందిన విశ్రాంత అధ్యాపకులు ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో హెల్త్‌కేర్ ఇన్ ఆంధ్రప్రదేశ్ ఎక్స్‌పర్ట్ ఆఫ్, ఆరోగ్యశ్రీ ప్రోగ్రామ్ ఈస్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారన్నారు.

గొప్ప పరిపాలనాదక్షుడు శ్రీకృష్ణదేవరాయలు

● జయంతి వేడుకలో పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు





నివాళులర్పిస్తున్న మేయర్ సురేష్‌బాబు, అంజద్‌బాషా, తోట క్రిష్ణ.. జనసేన నాయకుడు తుంగా రమణయ్య

కడప మారుతీనగర్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయలు గొప్ప పరిపాలనాదక్షుడని పలు పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. కృష్ణదేవరాయల 534వ జయంతిని పురస్కరించుకుని కృష్ణదేవరాయల సర్కిల్ (కృష్ణథియేటర్) వద్ద గల ఆయన కాంస్య విగ్రహానికి పార్టీల కతీతంగా హాజరై భారీ కేక్ కట్‌చేసి నివాళి అర్పించారు. తెలుగు ఖ్యాతిని ప్రపంచవ్యాపితం చేసిన తెలుగుభాషా కోవిదుడన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బి. హరిప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్‌బాబు, సుధా దుర్గాప్రసాద్, చెన్నంశెట్టి మురళి, వైసీపీ మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ తోటకృష్ణ, నాయకులు టి.శివశంకర్, అమరప్ప, బలిజ సంఘాల నాయకులు రాము, సగినాల శ్రీనివాసులు, పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని కోటవీధి, నూతన బస్టాండు ఆవరణంలో వెలసిన కోటగంగమ్మ అమ్మవారి 17వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రజలు, మహిళలు పిల్లలు, పెద్దలు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీదేవి భూదేవి శ్రీరంగనాథస్వామి కల్యాణం అంగరంగవైభంగా నిర్వహించారు. స్థానిక పూలంగళ్ల సర్కిల్‌లో రంగనాథస్వామి వారి కళ్యాణ వేదికపై ఆలయ అర్చకులు సోమేపల్లె కృష్ణరాజేష్‌శర్మ ఆధ్వర్యంలో శాశ్వత ఉభయదారులు చల్లా వంశీయులు పాల్గొనగా శాస్త్రోత్తంగా కళ్యాణాన్ని నిర్వహించారు.

'వక్ఫ్ బిల్లు సవరణ మత స్వేచ్ఛపై దాడి'

కడప నాగరాజుపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బిల్లు సవరణ మత స్వేచ్ఛపై దాడి అని కాంగ్రెస్ పార్టీ మాజీ పార్లమెంటరీ ఇన్‌చార్జి సయ్యద్ గౌస్‌పీర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బిల్లు సవరణలు సవరించాలని ప్రయత్నం చేస్తుంటే కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమిగా ఆ బిల్లు సవరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. జేఏసీ కన్వీనర్ సయ్యద్ బాబు బాయ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సత్తార్,చంద్రారెడ్డి, జాకీర్ మౌలానా, ఓబయ్య, తాహిర్ పాల్గొన్నారు.

నేటి నుంచి రథయాత్ర

చక్రాయపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): చక్రాయపేటలో వెలసిన వేంకటేశ్వర, రాచరాయ స్వామి ఆలయాల ప్రాంగణంలో మహాశివరాత్రిన ఒకే వేదికపై జరిగే శివపార్వతుల, లక్ష్మీ వేంకటేశ్వర కల్యాణానికి ఇంటింటికి వెళ్లి ఆహ్వానం పలికే కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ మోపూరి రామాంజనేయరెడ్డి తెలిపారు. ప్రతి గ్రామంలోను శివపార్వతులు, లక్ష్మీవేంకటేశ్వర ఉత్సవ విగ్రహాలతో కూడిన పంచకల్యాణి రథం వెంట వెళ్లి ఆహ్వానపత్రికలను అందజేస్తామన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి లావణ్య బదిలీ



లావణ్యను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం జూనియర్ సివిల్ కోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్న లావణ్య నరసరావుపేట సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ రంద ర్భంగా బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడు పుష్పరాజు, న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, రవీంద్రప్రసాద్, గురవయ్య మాట్లాడారు. ఆదివారం కోర్టు ఆవరణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మెమెంటోలో, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

శివరాత్రికి రోడ్డు మరమ్మతులు పూర్తయ్యేనా..?



పొలతలకు వెళ్లే మార్గంలో ఘాట్ రోడ్డుపై గుంతలు



కమ్మవారిపల్లె నుంచి నీరు కోన వెళ్లే దారి దుస్థితి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పొలతలకు వెళ్లే రహదారి గుంతమయమైంది. శివరాత్రి పండుగేమో రెండువారాలే ఉంది. పనులేమో పూర్తికా లేదు. లక్షలాది మంది భక్తులు పరమశివుడిని దర్శించుకునేందుకు వాహనాల్లో వస్తారు. కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డుతో పాటు, కమ్మవారిపల్లె నుంచి నీరుకోన వరకు వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా ఉందని పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

రాజుపాలెం,ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణరోడ్లకు మహర్దశ వచ్చింది. 2019 నుంచి గత ప్రభుత్వం రోడ్లపై దృష్టి పెట్టకపోవడంతో రోడ్లన్నీ వర్షాలకు గుంతలమయంగా ఏర్పడి అధ్వానంగా మారాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ రోడ్లపై దృష్టి సారించి రోడ్లు వేస్తుండడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పర్యటిస్తున్న సమయం లో గ్రామీణ రోడ్లపై దృష్టి సారించాలని ప్రజలు వినతులు తెలియజేయడంతో ప్రప్రథమంగా రాజు పాలెం మండలానికి జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.6.70కోట్లు, ఆర్అండ్బీ నిధుల కింద దాదాపు రూ.3.50 కోట్లు ఏర్పాటు చేయడంతో రోడ్ల పనులు సాగుతున్నాయి. దీంట్లో భాగంగా అయ్య వారుపల్లె నుంచి టంగుటూరు, రాజుపాలెం నుంచి అయ్యవారుపల్లె, పగిడాల నుంచి వెల్లాల, టంగుటూరు నుంచి తొండలదిన్నె. కొర్రపాడు నుంచి చిన్నశెట్టిపల్లె గ్రామానికి దాదాపు రూ.2కోట్లు వెచ్చించి ప్యాచ్ వర్క్ కింద రోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. అదే విధంగా జాతీయ ఉపాధి కింద ఇప్పటికే గ్రామీణప్రాంతాల్లో ఒక్కో గ్రామానికి రూ10లక్షల నుంచి 40లక్షల వరకు మంజూరు చేయడంతో రోడ్లన్నీ పూర్తయ్యాయి. దానికి తోడు పంచాయతీలకు నిధుల కింద 5 నుంచి 15లక్షల వరకు పంచాయతీ నిధులు మంజూరు కావడంతో డ్రైనేజీలు, నీటి సమస్య, సీసీరోడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఎన్నో రోజులుగా రోడ్లు సక్రమం గా లేకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్న సమయంలో రోడ్లు కూడా పూర్తవుతుండడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో మరిన్ని నిధులు తెచ్చి మిగతా రోడ్లను పూర్తి చేసేటట్లు అధికారులు ఎస్టిమేట్లు వేసి పంపించినట్లు తెలిపారు.



నాడు అయ్యవారుపల్లె - టంగుటూరు రోడ్డు అలా ...నేడు ఇలా...



నాడు రాజుపాలెం - అయ్యవారుపల్లె రోడ్డు, నేడు తారురోడ్డు వేసిన తర్వాత

రూ.40 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం



మూడిండ్లపల్లె మీదుగా వేసిన తారురోడ్డు

దువ్వూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని మూడిండ్లపల్లె మీదుగా వేస్తున్న ఆర్అండ్బీ పరిధిలోని తారు రోడ్డు పనులు చురుగ్గా చేస్తున్నారు. రోడ్డు నిర్మాణాన్ని వేగంగా చేపట్టడంతో పనులు పూర్తయ్యాయి. ఆరేళ్లుగా రోడ్డు పాడై జనాలు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తికాకుండానే నిధులు కేటాయించి తారు రోడ్డు వేయడంతో ఈ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వానాకాలంలో రాకపోకలకు ప్రజలు చాలా ఇబ్బంది పడ్డారు. ప్రస్తుతం రోడ్డు నిర్మాణానికి రూ.40 లక్షలు కేటాయించి పనులు చేపట్టినట్లు ఆర్అండ్బీ డీఈ శివకుమార్ తెలిపారు.

బీఎస్ఆర్ రైస్ మిల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే వరద



బీఎస్ఆర్ రైస్మిల్లును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం తాళ్ళమాపురం గ్రామ పంచాయతీలో ప్రముఖ మండీ వ్యాపారి మాజీ కౌన్సిలర్ బాదుబోయిన సుబ్బారావు (బీఎస్ఆర్) నిర్మించిన నూతన మినీ రైస్మిల్లును ఆదివారం ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ప్రొద్దుటూరులో మళ్ళీ పత్తి, రైస్ మిల్లులు తిరిగి ఏర్పాటై ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, బీఎస్ఆర్ రైస్ మిల్లు యజమాని బాదుబోయిన సుబ్బారావు యాదవ్ ఆయన కుమారులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఐక్యతతోనే రాజకీయ నేతల్లో వణుకు



బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం ఎదురుగా ఐక్యత చాటుతున్న బీసీ నాయకులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు నియోజకవర్గంలో బీసీలంతా ఐకమత్యంతో బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం ఏర్పాటు చేయడం రాజకీయ నేతల్లో వణుకు పుట్టిస్తోందని పలువురు తెలిపారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలోని తేరు రోడ్డులో సుమారు 26 బీసీ సంక్షేమ సంఘ నాయకులు హాజరై కార్యాలయాన్ని అధ్యక్షుడు కొండయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జమ్మలమడుగు అధ్యక్షుడు చౌడం జొల్లు కొండయ్య, ప్రొద్దుటూరు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలు ఐకమత్యంతో సమస్యల పరిష్కారం కోసం ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ కాటా రామదాసు, కోశాధికారి వెంకోబారావు, మాజీ సర్పంచ్ సురేష్, బాలకొండయ్య, ఉపాధ్యక్షుడు పొన్నతోట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జీవన్, రజక సంఘం అధ్యక్షుడు చెన్నప్ప, వాల్మీకి సంఘం అధ్యక్షుడు పెద్దకంబయ్య, మద్దులేటి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యంగా ఉంటామని మలేరియా సబ్యూనిట్ అధికారి సి.మురళీధర్మూర్తి పేర్కొన్నారు. ఆదివారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని బీసీ బాలికల వసతి గృహంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ మనోరాణి, సీవో సుబ్బారెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలి

కాశినాయన ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి):రోడ్డుభద్రతా నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని ఎస్ఐ హనుమంతు పేర్కొన్నారు. ఆదివారం నర్సాపురం మూడురోడ్ల కూడలిలో వాహనాల తనిఖీలు చేపట్టారు.ఈసందర్భంగా నిబంధనలు పాటించని 10 వాహన దారుల నుంచి రూ.2,550 జరిమానా విధించారు.

న్యాయవాది పద్మనాభరెడ్డిపై దాడి

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు మండలం దొరసానిపల్లె గ్రామంలో వుండే న్యాయవాది పద్మనాభరెడ్డిపై శనివారం సాయంత్రం ఇంట్లో వుండగా కొందరు దాడి చేశారు. ఈ దాడిలో న్యాయవాదితోపాటు అతని కుమారుడికి గాయాలయ్యాయి. ఇటీవల జీఎస్టీ విషయంలో నకిలీ కంపెనీలు పెట్టి మోసాలకు పాల్పడుతున్న కొందరిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదును సోషల్మీడియాలో పద్మనాభరెడ్డి ఒక పోస్టు చేశారు. జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేయడాన్ని జీర్ణించుకోలేని జింకా మూర్తి, జింకా సాగర్, నాగరాజు, శివప్రసాద్ అనే వ్యక్తులు తన పై దాడిచేసినట్లు పద్మనాభరెడ్డి ఆదివారం రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఎస్ఐ వెంకటసురేష్ కేసునమోదు చేసి విచారిస్తున్నారు.

సాహిత్యానికి రాయల సేవలు మరువలేనివి



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బలిజసంఘం నేతలు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : తెలుగు భాషా సాహిత్యం కోసం శ్రీకృష్ణ దేవరాయలు చేసిన సేవలు మరువలేమని పట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు మంచి రాజా, కార్యదర్శి జయశంకర్ కొనియాడారు. ఆది వారంశ్రీకృష్ణ దేవరాయల జయంతిని పురస్కరించుకుని పట్టణ బలిజ సంఘం ఆధ్వర్యంలో శివాలయం వీధిలోని శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమం లో సంఘం గౌరవ అధ్యక్షుడు గుమ్మటమయ్య, ఉపాధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, కొండన్న, జాయింట్ సెక్రటరీ ఆకుల చంద్రశేఖర్, ముక్కంటి వెంకట రమణ కోనేటి కన్నా, విశ్వనాథ్, తోట చంద్రశేఖర్, రిటైర్డ్ ఎస్ఐ శంకర్,కొమ్మిశెట్టి నాగేంద్ర, ఆవుల శ్రీనివాసులు,సుబ్రమణ్యం పాల్గొన్నారు.

మైదుకూరురూరల్..: మైదుకూరు పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల 534వ జయంతి వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాయల కూడలిలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేశారు.అనంతరం స్వీట్లు పంచిపెట్టారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బండి అమర్నాథ్,తుపాకుల రమణ, పందిటి సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ



ప్రత్యేక అలంకరణలో సీతారాములు

ఖాజీపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బీచువారిపల్లె గ్రామంలో మూడు రోజులపాటు సీతారాముల ఆలయానికి ఘనంగా పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు.

అనంతరం అన్నదానం నిర్వహిం చారు. విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, టీడీపీ నాయకులు భాస్కర్రెడ్డి, ఆదినారాయణరెడ్డి, హరినాథరెడ్డి, దుంపలగట్టు రవి, కిశోర్కుమార్రెడ్డి, ప్రతాప్రెడ్డి,సుబ్బయ్య, హబీబ్, హర్షద్, ఇండ్ల సుబ్బారెడ్డి, పుల్లయ్యనాయుడు, టీవీ కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సైనికుడికి నివాళులు



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని వసంతపేటకు చెందిన మాజీ సైనికుడు అబ్దుల్ రజాక్ మృతిపట్ల మాజీ సైనికులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన అనారోగ్యంతో మృతిచెందడంతో ప్రొద్దుటూరు డివిజన్ సైనిక సంఘం ఆధ్వర్యంలో మాజీ సైనికులు ఆదివారం ఉదయం ఆయన నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు డివిజన్సైనిక సంఘం అధ్యక్షుడు బాలవీరారెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబశివారెడ్డి, హంస్సేన్, వల్లి, నాగేశ్వరుడు, రవిశంకర్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి పోస్టర్లు విడుదల చేసిన ఎమ్మెల్యే



పోస్టర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్యాదవ్

చాపాడు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో ఈనెల 26న బుధవారం జరిగే మహాశివరాత్రి పండుగకు సంబంధించిన పోస్టర్లను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్యాదవ్ ఆదివారం రాత్రి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులకు దైవదర్శనం కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేసీకెనాల్ వైస్చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, టీడీపీ నాయకులు గుత్తి వీరనారాయణ, వెంకటేశ్వరరెడ్డి, పెరుగు వీరనారాయణ, వేమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో రితీశ్రెడ్డి



వధూవరులను ఆశీర్వదిస్తున్న రితీశ్రెడ్డి

బి.కోడూరు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తిరుపతిరెడ్డి బామ్మర్ది వివాహ వేడుకలకు బద్వేలు ఇన్చార్జ్ రితీష్కుమార్రెడ్డి ఆదివారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వీరి వెంట టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, గోడి భాస్కర్రెడ్డి, రమణారెడ్డి, శేషారెడ్డి, ఎల్ఎస్పీ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి, జయరామిరెడ్డి, రామ్మోహన్రెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, రాఘవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బీజేపీ శంకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒరిగిన విద్యుత్తు స్తంభాలతో స్థానికుల్లో ఆందోళన



మోరగుడిలో ప్రమాదకరంగా ఉన్న స్తంభం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పలు ప్రాంతాల్లో ఒరిగిన విద్యుత్తు స్తంభాలతో ప్రజల్లో నెలకొంది. మోరగుడి గ్రామంలోని రచ్చబండ సమీపాన సచివాలయం వెనుక భాగంలో పొలంలో స్తంభాలు ఒరిగాయి. అలాగే జమ్మలమడుగు పట్టణంలోని పీఎస్ఆర్ థియేటర్ వెనుకభాగంలో 3/6 ఇంటి నంబరు ఎదురుగా విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. ఒరిగిన విద్యుత్తు స్తంభంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని పట్టణంలోని విద్యుత్తు సబ్స్టేషన్ అధికారులకు, స్థానికులకు తెలిపినా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి ప్రమాదం జరుగక ముందే ఒరిగిన విద్యుత్తు స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపటి నుంచి కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

మైలవరం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రామచంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు బ్యాంకు మేనేజర్ల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మేజర్ పంచాయతీలు అయిన వేపరాల, దొమ్మరనంద్యాలకు మధ్యాహ్నం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని, దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో తెలిపారు.

ముద్దనూరు..: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి తెలిపారు. బ్యాంకు ప్రతినిధుల సమక్షంలో ఉదయం 10-30 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు.ఆన్లైన్ దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆధార్కార్డు తప్పక తీసుకొని రావాలని ఆయన తెలిపారు.

ఖాజీపేట..: బీసీ కార్పొరేషన్లో దరఖాస్తు చేసుకున్నవారు ప్రతి ఒక్కరూ ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీవో వెంకటరమణ అన్నారు. 18వతేదీ ఇంటర్వ్యూకు హాజరుకావాలని, ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు అప్లికేషన్, ఆధార్కార్డు, రేషన్కార్డు, కుల ధృవీకరణ పత్రం, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్తోపాటు రెండు జిరాక్స్ కాపీ సెట్లు తీసుకురావాలన్నారు. ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో హాజరుకావాలన్నారు. ఓసీలు ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

చీరలు పంపిణీ

ప్రొద్దుటూరు రూరల్, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో 200 మంది పేదలకు చీరెలను మాజీ సర్పంచ్, వైసీపీ నాయకుడు నాగేంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఆదివారం ఆయన తల్లి సరోజమ్మ 25వ వర్ధంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం పేదలైన మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. రాజగోపాల్రెడ్డి, సర్పంచ్ శివలక్ష్మి, మల్లీశ్వరి, భరత్రెడ్డి పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని దేవగుడి, సలివెందుల గ్రామాల సరిహద్దులలో ఆదివారం సాయంత్రం 11 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. వారిని జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్కు తరలించి వారి వద్ద రూ.1,12,800 స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. అలాగే నంద్యాలజిల్లా కొలిమిగుండ్ల నాగిశెట్టిపల్లె గ్రామానికి చెందిన కొల్లు వెంకటేష్ అనే వ్యక్తి వద్ద నుంచి 70 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు తెలిపారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

దువ్వూరు..: మండలంలోని క్రిష్ణంపల్లె సమీపంలో ఆదివారం జూదం ఆడుతున్న అయిదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్కుమార్ తెలిపారు. వీరి వద్ద 13,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దీంతోపాటు మద్యం తాగుతూ వాహనం నడుపుతున్న వ్యక్తులను బైపాస్ రహదారిలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

ఖాజీపేట, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు మీకేమైనా సమస్యలుంటే మా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని సీఐ మోహన్ అన్నారు. ఆదివారం స్థానిక గర్ల్స్ హాస్టల్ను పరిశీలించి విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గర్ల్స్ హాస్టల్ వార్డెన్, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఇంటిస్థలాలు, భూములను మంజూరు చేయాలి

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఉండే అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం మూడు సెంట్లు స్థలం, వ్యవసాయ భూములను మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి జ్వాలా హృదయనాథ్, పెద్దుళ్లపల్లె ప్రభాకర్ పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చి 8 నెలలు అవుతున్నప్పటికీ పేదల సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు.

చెరువు మట్టిని తవ్వేస్తున్నారు..!

చెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం ● పట్టించుకోని అధికారులు



చెరువులో కట్టకు అతి సమీపంలో తవ్వుతున్న ఎక్స్కవేటర్, గతంలో చెరువుకు పడిన గండి

ముద్దనూరు ఫిబ్రవరి16(ఆంధ్రజ్యోతి):ముద్దనూరు చెరువు జమ్మలమడుగు రోడ్డులోని కొండ సమీపంలో ఉంది. దానిని చుట్టుకొలత దాదాపు రెండు కిలోమీటర్లు ఉంటుంది. కట్ట ఒక ప్రక్క 20 అడుగుల మైన గండి పడి దాదాపు నాలుగో సంవత్సరాలు కావస్తుంది. దానిని ఇంత వరకు పూడ్చలేదు.అంతేకాకుండా చెరువు మట్టిని భారీ ఎత్తున తవ్వి తరలిస్తున్నారు.రెవెన్యూ, సంబంధిత ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నారు.వివరాల్లోకి వెలితే...ముద్దనూరు చెరువు నీళ్లు వస్తే వ్యవసాయ బోర్లు, మంచి నీటి బోర్లు రీచార్జ్ అవుతాయి. ఎండాకాలంలో నీటి సమస్య ఉండదు. కొద్ది రోజుల నుంచి చెరువులో మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. భారీ ఎత్తున ట్రాక్టర్లలో ప్రొద్దుటూరుకు తరలిస్తున్నారు.కట్టకు దగ్గరగా ఎక్స్కవేటర్లతో తవ్వకాలు జరుపుతున్నారు.దాదాపు 20 ట్రాక్టర్లలో ప్రొద్దుటూరుకు మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు.కట్టకు అతిసమీపంలో తవ్వకాలు జరుపుతుండటంతో కట్టకు బలం తగ్గే అవకాశం లేకపోలేదు. అయితే దానికి సంబంధించిన వారు ఎవరూ ఆ ప్రాంతంలో లేరు. ఎక్స్కవేటర్ డ్రైవర్ మాత్రం బాడుగకు వచ్చామని చెబుతున్నారు.భారీ ఎత్తున చెరువు మట్టిని 35కిలోమీటర్ల దూరంలో నున్న ప్రొద్దుటూరుకు తరలిస్తున్నా పట్టించుకునే వారు లేకపోక పోయారన్న విమర్శలు వస్తున్నాయి. చెరువు తెగి నాలుగు సంవత్సరాలు కావస్తోందని, కట్ట వద్ద తవ్వకాలు జరిపితే ఆ కట్టకు బలం తగ్గే అవకాశం ఉన్నా అధికారుల నిర్లక్ష్యం పై ప్రజలు గుసగుసలాడుతున్నారు.